'ఎంవీఎస్' 60వసంతాలు అంబరాన్నంటాలి

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 29: క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల 60 వసంతాల ఉత్సవాలను వచ్చే ఏడాది ఘనంగా నిర్వహించుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఎంవీఎస్ కళాశాలకు రాష్ట్ర, దేశ, ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా అంతా కలిసి కృషిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో పూర్వవిద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు బుర్రి వెంకట్రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కేఎస్.రవికుమార్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి, వినోద్‌కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ప్రైవేట్ టీచర్లకు డబుల్ బెడ్రూం ఇండ్లు

● జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఉత్తమ అవార్డులు పొందిన ప్రైవేట్ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబర్ 29 : ప్రైవేట్ పాఠశాలల్లో చాలీచాలని జీతాలతో బతుకుతున్న పేద టీచర్లకు డబుల్‌బెడ్రూం ఇండ్లను ఇప్పించడానికి కృషి చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలోని చంద్రాగార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్చర్లలోని ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఆయన అవార్డులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య అనేది లాభపేక్షలేని రంగమన్నారు. తాను విద్యాభివృద్ధి కార్యక్రమాలకు తొలిప్రాధాన్యత ఇస్తానన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రైవేట్ టీచర్లకు చాలినంత వేతనాలు ఉండవని ఈ కారణంగా వారు అనేక ఇబ్బందులు పడుతుంటారన్నారు. ఈ కారణంగానే ఇంకా అనేక మంది టీచర్లు పేదరికంలోనే ఉన్నారనే విషయం తనకు తెలుసన్నారు. జడ్చర్లలో ఇండ్లు లేని నిరుపేదలు ఇంటికోసం దరఖాస్తులు పెట్టుకుంటే వారికి డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. రాజకీయపార్టీలు ఇచ్చే బంద్ పిలుపులకు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు స్పందించకూడదని, పాఠశాలలను బంద్ చేయకూడదని కోరారు. అంతకుముందు నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అయూబ్, నరేశ్, గోవర్ధన్, నాయకులు శివకుమార్, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలోనే ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ● రూ.430కోట్ల అంచనాతో శాశ్వత పరిష్కారం

మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, సెప్టెంబర్ 29: నియోజకవర్గంలో సంగంబండ రిజర్వాయర్ నుంచి ప్రజలకు తాగునీరు అందించేందుకు త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా 15రోజుల నుంచి మక్తల్‌లో తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని.. నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సంగంబండ రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించేందుకు రూ.430కోట్లతో శాశ్వత పరిష్కారం కోసం అంచనాలు వేసి ప్రభుత్వంతో చర్చించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని.. త్వరలోనే శాశ్వత తాగునీటి పరిష్కారానికి చర్యలు చేపడుతామని ప్రజలకు సూచించారు. తరచుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీటిసరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, కట్ట సురేశ్, గణేశ్, నాగేందర్, లక్ష్మణ్, నరేందర్, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగా, హోమియోపతి వైద్య శిబిరం

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 29: పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో సోమవారం విశ్వమానవత సేవా సమితి, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా, హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సురేశ్, విశ్వమానవత సేవా సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేశ్ శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటల నుంచి 7:30గంటల వరకు యోగా , 8:30గంటల నుంచి 12గంటల వరకు హోమియోపతి వైద్యశిబిరం ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయల్ యువర్ డీఎం

నారాయణపేటరూరల్, సెప్టెంబర్ 29: నారాయణపేట, కోస్గి ఆర్టీసీ డిపో పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు సమస్యలు, సలహాలను అందించేందుకు సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. తమ సూచనలు, సలహాలను 7382826293నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

స్వచ్ఛతా.. నీవెక్కడా ?

● ఇండ్ల మధ్య నిలిచిన మురుగు
● పట్టించుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు
● ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

సాయినగర్ కాలనీలో ఇండ్ల మధ్య పెరిగిన కంపచెట్లు


ఇండ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

నిలిచిన మురుగు నీరు (ఫైల్)

దేవరకద్ర, సెప్టెంబర్ 29 : ఊరుదిబ్బ.. పేరు పెద్ద అనుచందంగా మారింది నియోజకవర్గ పరిస్థితి. ప్రభుత్వం గ్రామంలో పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో గత నెలల్లో 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని ఎంతో ఆర్భాటంగా చేసి చేతులు దులుపుకున్నారు. మండల కేంద్రంలోని పలు వార్డుల్లో డైనేజీలు లేక పోవడంతో, ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్ల మధ్యలో మురు గబీరు నిలిచి పోయింది. దీంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాల బారిన పడడంతోపాటు దుర్వాసనతో వస్తుంది. పట్టణంలోని సాయినగర్, రాఘవేంద్రకాలనీ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా దేవరకద్ర పట్టణం విస్తరించి వివిధ కొత్త కాలనీలను ఏర్పాటు చేయడంతో ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేసి ఇండ్లను నిర్మాణం చేసుకోవడం జరిగింది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు అప్పటి నుంచి ఇంటి ట్యాక్స్‌లను వసులు చేస్తున్నా కాలనీల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి జరగడంలేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి ప్లాట్లను శుభ్రపర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నం

ఇండ్ల మధ్య మురుగు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాలతో ఇబ్బంది పడుతున్నం. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురు గను తొలగించే చర్యలు తీసుకోవాలి.

– శివాజీ, దేవరకద్ర

రోగాలు వస్తున్నాయ్

వర్షాలతో ఇండ్ల మధ్య మురుగు నిల్వలు పేరు కోపోయి దుర్వాసన వస్తుంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగాయి. దీంతో రోగాలు వస్తున్నాయి. పాములు, తేళ్లు సంచరిస్తుండడంతో భయం గుప్పిట్లో ఉంటున్నాం. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి

– ఎండీ. సోహేల్, దేవరకద్ర

రాజ్యాంగమే వారికి అడ్డంకిగా మారింది

● అఖిల భారత విద్యా హక్కు వేదిక ప్రిసీడియం సభ్యుడు హరగోపాల్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 29: బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అన్ని రకాలైన హక్కులు, అవకాశాలు పొందుపర్చబడి ఉన్నా.. ఇవాల కొందరికి రాజ్యాంగమే అడ్డంకిగా మారిందని అఖిల భారత విద్యా హక్కు వేదిక ప్రిసీడియం సభ్యుడు హరగోపాల్ ఆరోపించారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 'మారుతున్న సమాజం–ప్రజాస్వామిక విలువలు–విద్యారంగం–మన కర్తవ్యం' అనే అంశంపై ఏర్పాటు చేసిన విద్యాసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే సంపన్నుడుగా ఉన్న అదానీ దేశ ఖనిజ సంపద రా మెటీరియల్‌ను డైరెక్టుగా అమ్ముకునే వ్యవస్థ వల్ల దేశం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అధికారం వచ్చినప్పటి నుంచి బీజేపీ చైనాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు గానీ ఏమీ చేయలేపోతున్నారన్నారు. ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, చట్టబద్ధమైన పాలన ఇవన్నీ బీజేపీ వాళ్లకి అడ్డమే అన్నారు. నేటి సమాజంలో టెక్నాలజీ పెరుగుతున్నా.. మానవ సంబంధాలు సంక్షోభంలో పడ్డాయన్నారు. చీఫ్ మినిస్టర్ 29 లక్షల చెట్లు అడ్డం వస్తున్నాయ్.. వాటిని పీకేస్తాం అంటున్నారని.. మనుషులు అడ్డం వస్తే.. ఏం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా డైట్ కళాశాలలు, బీఈడీ కళాశాలలన్నీ నిర్వీర్యం అయ్యాయని డీఈవో రవీందర్ అన్నారు. ఒక డైట్ కళాశాలలో 21 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా రాష్ట్రవ్యాప్తంగా కేవలం 14 మంది మాత్రమే ఉన్నారన్నారు. ఒక కళాశాలలో ఉండాల్సిన సంఖ్య కన్నా తక్కువగా ఉన్నారని విమర్శించారు. డైట్, బీఈడీ కళాశాలల్లో వెంటనే పదోన్నతులు, నియామకాలు చేపట్టకపోతే అవన్నీ జీరో అవుతాయన్నారు. 33 జిల్లాలకు రెగ్యూలర్ డీఈవోలు నలుగురు మాత్రమే ఉన్నారన్నారు. డైట్ కళాశాలలను వెంటనే బలోపేతం చేయాలని కోరారు. అంగన్‌వాడీలను పాఠశాలల్లో విలీనం చేస్తామని, ఇంటర్మీడియట్‌ను స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలిపితే ఎట్లా అని ప్రశ్నించారు. ఇప్పటికే పాఠశాల విద్యావ్యవస్థ సంక్షోభంలో ఉందన్నారు. మండలానికి ఒక పెద్ద పాఠశాల అంటున్నారని.. మిగిలిన చిన్న పాఠశాలలను ఏం చేస్తారని, పాఠశాలలు తగ్గిస్తే ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులు ఆర్డీవో, డీఆర్వోలు, అదనపు కలెక్టర్ రెవెన్యూ వద్ద పీఏలుగా పనిచేయాలా.? అని ప్రశ్నించారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, పీఏవీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా స్థాయి ఎంపికలు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 29: పట్టణంలోని మినీ స్టేడియంలో అక్టోబర్ 2వ తేదీన 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 ఏండ్లలోపు క్రీడాకారులకు ఈ ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7, 8 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. మిగతా వివరాలకు 9100753683, 9059325183, 9063500768 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు మహాజన సభ

భూత్పూర్, సెప్టెంబర్ 29 : మండల ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో సోమవారం ఉదయం 11గంటలకు మహాజన సభను నిర్వహిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సభకు డైరెక్టర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

దళితుల భూమిని ఆక్రమించడం సరికాదు

నిజాలాపూర్‌లో విచారిస్తున్న సభ్యులు

మూసాపేట, సెప్టెంబర్ 29 : దళితుల భూమిని ఆక్రమించడం సరికాదని ఎమ్మార్పీఎస్ ఆర్ఆర్ రాష్ట్ర ముఖ్య సలహాదారు సింగిరెడ్డి పరమేశ్వర్ మాదిగ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు అన్నారు. మండలంలోని నిజాలాపుల్ గ్రామాన్ని ఆదివారం నిజనిర్ధారణ కమిటీ సభ్యుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల మధ్య విభేదాలను సృష్టించి విడదీయాలనే లక్ష్యంతో ఇటీవల కొంత మంది అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో దళితులకు ఉన్న స్థలాన్ని ఆక్రమించి మాదిగ ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణం చేయడానికి ప్రయత్నించారని, ఆ విషయంపై గతంలో ఫిర్యాదు చేయగా పనులు నిలిపివేసినట్లు చెప్పారు. కానీ ఇప్పుడు కొంత మంది నాయకులు మళ్లీ ఆ స్థలంలో ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అందుకే ఎస్సీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యుల బృందం సభ్యులు పర్యటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేకంగా విన్నవిస్తున్నట్లు, ఎస్సీ కమిటీ నిర్మాణం కోసం పేద దళితుడి స్థలం కాకుండా ఆయన తండ్రి జ్ఞాపకార్థం స్థలాన్ని కొనుగోలు చేసి ఎస్సీ కమిటీ హాల్‌ను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు ఆనంద్, ప్రవీణ్, రాములింగం తదితరులు పాల్గొన్నారు.

విత్తన చేపపిల్లల పరిశీలన

ధన్వాడ, సెప్టెంబర్ 29: జిల్లాలోని కుంటలు, చెరువులు, రిజర్వాయర్లలో ప్రభుత్వం ఉచితంగా అందించే చేపపిల్లలకు ఇద్దరు టెండర్స్ వేశారు. అందులో భాగంగా ఇద్దరి ఫిష్ సీడ్ పాండ్స్ ఇన్‌స్పెక్షన్ చేశారు. నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, జిల్లా వెటర్నరీ అధికారి ఈశ్వర్‌రెడ్డి ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ వర్ధన్ పాల్గొన్నారు.

జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం

జడ్చర్ల, సెప్టెంబర్ 29 : జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం మారుతి ఓమ్నివ్యాన్ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ స్టేషన్ సీఐ విప్లవ రెడ్డి ఆదివారం తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ జడ్చర్లలో పట్టుబడిన కేసులోని మారుతి ఓమ్ని వాహనానికి వేలం వేయడం జరుగుతుందని, ఆసక్తి గలవారు రూ.5వేలు డిపాజిట్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలంలో వాహనం దక్కని వారికి తమ డిపాజిట్‌ను తిరిగి ఇవ్వడం జరుగుతుందని సీఐ తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు జడ్చర్లలోని ఎక్సైజ్ స్టేషన్‌లో వేలాన్ని నిర్వహించనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

దేవరకద్ర, సెప్టెంబర్ 29 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తాసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఏపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వ్యవసాయాధికారి పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, విద్యుత్ తదితర అన్ని శాఖల అధికారులు ఉంటారని పేర్కొన్నారు. కావున మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

నారాయణపేట, సెప్టెంబర్ 29: తిరుమల లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీని నిరసిస్తూ సోమవారం పట్టణంలో శక్తిపీఠం నుంచి ఉదయం 10:30గంటలకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నగర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. హిందూ బంధువులు, వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప, మాణికేశ్వరి దీక్షా భక్తులు, భజన సంఘాలు, ఆలయాల కమిటీలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు.

హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు విజయం

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 29: హెచ్‌సీఏ బాలుర అండర్–19 వన్‌డే రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి పాలమూరు జట్టు విజయం సాధించింది. ఆదివారం వరంగల్ స్పోర్ట్స్ బాక్స్ గ్రౌండ్‌లో రెండో మ్యాచ్‌లో జిల్లా జట్టు 88 పరుగుల తేడాతో నల్గొండ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 50 ఓవర్లలో 186 పరుగులకు 8వికెట్లు కోల్పోయింది. జట్టులో అబ్దుల్ రఫీ 71 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 32ఓవర్లలో 98 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ కనిష్క్ 1 పరుగు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. రెండో మ్యాచ్‌లో జిల్లా జట్టు విజయం సాధించడంపై ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజ శేఖర్, కోచ్ గోపాలకృష్ణ, అబ్దుల్లా అభినందించారు.

విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

హరితస్వప్నం పుస్తకావిష్కరణ

మహబూబ్‌నగర్, అర్బన్ సెప్టెంబర్ 29: సమాజాన్ని కదిలించేదే అసలైన కవిత్వమని, అలాంటి కవిత్వమే నేటి ప్రపంచంలో ఎప్పటికీ నిలుస్తుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య దామచర్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో నిర్వహించిన పాలమూరు సాహితీ అవార్డు–23 ప్రదానోత్సవం, హరితస్వప్నం పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు జిల్లా కరువుకు నిలయంగా ఉన్న రోజుల్లో కూడా ఇక్కడి కవులు తెలుగు సాహిత్య రంగానికి విశేషంగా కృషి చేసి, నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. కవి తనలో తాను సంఘర్షణ పడితేనే చక్కటి, చిక్కటి కవిత్వం ఆవిష్కృతమవుతుందన్నారు. 2023వ ఏడాదికి 'రాత్రి సంఘిని' సాహిత్య అవార్డును ప్రముఖ కవి డాక్టర్ బాణాల శ్రీనివాసరావుకు అందజేశారు. రచయిత, కవికి ఈ అవార్డు దక్కడం నిజమైన గౌరవమని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మనోహర్ రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, బుర్రి వెంకట్రామ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి కృష్ణమూర్తి, పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో ప్రముఖులు

సన్నిధి ఆశ్రమానికి రిలయన్స్ స్మార్ట్ చేయూత

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29: సన్నిధి ఆశ్రమానికి రిలయన్స్ స్మార్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సన్నిధి ఆశ్రమంలో పేద విద్యార్థుల సహాయార్థం రూ.24వేలు విలువ చేసే నిత్యావసర సరుకుల ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ స్మార్ట్ స్టోర్ మేనేజర్ రమేశ్, ఏఎస్ఎం నర్సింహులు రూ.24వేల విలువ చేసే బియ్యం, పప్పు, ఆయిల్ తదితర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ఆదుకునేందుకు రిలయన్స్ స్మార్ట్ నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమన్నారు. రిలయన్స్ మేనేజర్ రమేశ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చేయూతను ఇవ్వడంలో రిలయన్స్ స్మార్ట్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు రమణయ్య, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త లయన్ చంద్రశేఖర్, సన్నిధి ఆశ్రమం సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ, రాజేశ్వరి, రిలయన్స్ స్మార్ట్ ఉద్యోగులు నర్సింహులు, శివకుమార్, సాయికుమార్, కుర్మయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న రిలయన్స్ స్మార్ట్ మేనేజర్ రమేశ్

సన్మానం పొందిన ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 29: జిల్లా కేంద్రంలోని ఆదర్శ ఉన్నత పాఠశాల 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. లక్ష్మి బంకెట్‌హాల్‌లో నిర్వహించిన సమ్మేళనంలో ముందుగా 25 సంవత్సరాల కిందటి అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అలాగే మృతిచెందిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గురువులకు పూలమాల, శాలువాలతో సన్మానించారు. చివరిగా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, రాఘవేంద్రచారి, వెంకటేశ్, శశిధర్, సుదర్శన్, జనార్దన్, సక్సేనా, వీరన్న, వెంకటేశ్వర్ రెడ్డి, శశికళ, శ్రీలత, పూర్వ విద్యార్థులు జితేందర్, బాలరాజు, మమత, శైలజ, కవిత, సతీశ్, సురేశ్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUSINESS OFFER
★పెట్టుబడి పెట్టండి.. ప్రతిరోజూ సాయంత్రం లాభాలు పొందండి... వ్యాపారం చేయాలనుకునే వారికి అవకాశం. ఆఫీస్: ఎల్.బి.నగర్, హైదరాబాద్. 8897651635.
NT-338767

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748